www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 మార్చి 2024
5
వైఎస్ఆర్



మహిళలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జియోన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు ఎస్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, పిజిటి యస్ కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల జ్యోతి, కన్వీనర్ భారతి పోటీలను పర్యవేక్షించారు. లెమన్ అండ్ స్పూన్, వాలీ బాల్, టెన్నికాయిట్, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు కృష్ణ కుమారి, సునీత, జానకి, పద్మజ, లక్ష్మి, జ్యోతి,ఎ. కె. పద్మ, అరుణమ్మ, గాయత్రి, ప్రసన్న, సుహాసిని, క్రాంతి, ప్రమీల,చందన, రోజా, నాయకులు నిత్య, శ్రీనివాసులు,, సైదేశ్వర్ రెడ్డి, నాగార్జున, విజయ్, పద్మనాభం, కాటమయ్య కమాల్ భాషా, మహిళా ఉద్యోగుల పాల్గొన్నారు.

కడపలో తమ్ముళ్ల కుస్తీ

- రెండుగా చీలిన టిడిపి శ్రేణులు
- ఇంటిపోరులో కడప ఇన్‌ఛార్జి
- ఆందోళనలో టిడిపి కేడర్

'ఇంటిపోరు ఇంతింత కాదయా' అనే సామెత కడప టిడిపి పరిస్థితిని తలపిస్తోంది. అసెంబ్లీ టికెట్ రేసులో ఆర్.మాధవి, మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి హోరా హోరీగా పోటీ పడిన సంగతి తెలిసిందే. ఇటీవల టిడిపి అధిష్టానం టికెట్‌ను మాధవికి ఖరారు చేసింది. కడప ఇన్‌ఛార్జి అసంతృప్తులను బుజ్జగింపులతో దారికి తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకు భిన్నంగా ఎదురు తన్నుతోంది. ఎక్కడ పొరబాటు దొర్లిందో గుర్తించి చికిత్స చేసుకోవాలి. ఒకవైపు అధికార వైసిపి అభ్యర్థి సమన్వయంతో దూసుకెళ్తుండగా, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థి గ్రూపులు, వేర్వేరుగా ప్రచారాలు, ప్రత్యేక శిబిరాల నిర్వహణతో రోజురోజుకూ బలహీన పడుతుండడం కేడర్‌ను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



మాధవి

కడప టిడిపిలో అంతర్గత కుమ్ములాటలు పతాక స్థాయికి చేరుకుంది. రెండు నెలల కిందట టికెట్ కోసం పోటీ పడిన మాధవి, అమీర్‌బాబు, అలం ఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి మధ్య మనస్పర్థలు తొలగడం లేదు. ఎవరికి వారుగా ప్రచారాలు, ఎత్తుగడల్లో నిమగ్నం కావడం గమనార్హం. టిడిపి టికెట్ దక్కించుకున్న కడప ఇన్‌ఛార్జి మాధవి చేసిన ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. రెండు నెలలుగా సాగించిన అగ్రెసివ్ పాలిటిక్స్ సొంత ఇంట్లో ఏర్పడిన కుంపటి కారణంగా నీరసించిపోతోంది. టికెట్ రేసు ముగిసిన అనంతరం బుజ్జగింపులు, సన్మానాలు వంటి సానుకూల ధోరణితో టిడిపి నాయకత్వాన్ని, ద్వితీయశ్రేణి కేడర్‌ను, శ్రేణులను ఏకం చేయాలి. రెండు నెలల కిందట తరహాకు ఏ మాత్రమూ తీసిపోని పరిస్థితిని తలపిస్తోంది. ఇటీవలి వరకు అసంతృప్త నేతలు వేర్వేరుగా ప్రచారాలు నిర్వహించారు. సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి అపార రాజకీయ అనుభవాన్ని, కడప అసెంబ్లీ ఓటర్ల జాబితాలోని 2,74,226 ఓట్లలో మూడింట ఒక వంతు కలిగిన మైనార్టీ ఓట్లను ఆకర్షించడానికి ఉపయోగపడే అమీర్‌బాబుని నిర్లక్ష్యం చేయడం టిడిపికి మైనస్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. తాజాగా ఓ నేత కన్వెన్షన్ హాలులో అసంతృప్త నేతలు ఆత్మీయ సమావేశాల పేరుతో కలుసుకోవడం అసమ్మతి తీవ్రతకు అద్దం పడుతోంది. టిడిపి అభ్యర్థి ఇంటి పోరును అధిగమించడం సవాలుతో కూడిన వ్యవహారంగా మారింది. ఈ నెల 10న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కడప నగరంలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. అప్పటి సమావేశంలో టిడిపి అసంతృప్త నేతలను బుజ్జగించి గాడిలో పెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లోకేష్ అసంతృప్త నేతలను బుజ్జగించి, వారి రాజకీయ భవిష్యత్తుకు స్పష్టమైన హామీ ఇస్తే తప్పా సమస్య కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.



అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి

మా మద్దతు లేకుండా మాధవి ఎమ్మెల్యే అవుతారా?

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవి రెడ్డి తమ మద్దతు లేకుండా ఎమ్మెల్యే అవుతారా అని ఆ పార్టీ అసమ్మతి వర్గ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని రహమతియ ఫంక్షన్ హాల్లో టిడిపి అసమ్మతి వర్గం అమీర్ బాబు, అలా ఖాన్ పల్లి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం తాము ఎంతో కష్ట పడ్డామని చెప్పారు. ఇన్‌ఛార్జులకు తెలియకుండా టిడిపి అభ్యర్థి మాధవి రెడ్డి తమ డివిజన్‌లలో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కడపలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం గొడవలు పెట్టిందని విమర్శించారు. మాధవి రెడ్డి అంటే కడపలో ఎవరికి తెలియదన్నారు. శ్రీనివాసులు రెడ్డి జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు ఒక్క కార్పొరేటర్‌ను గెలిపించ లేకపోయారని పేర్కొన్నారు. టిడిపిలో తగిన న్యాయం జరిగే వరకు పోరాడతాం అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- నగర కమిషనర్ ప్రవీణ్ చంద్

ప్రజాశక్తి - కడప

రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో అత్యంత కీలక పాత్ర పోషించాలని నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి,మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్ర పై ఎంసిఎంసి మెంబర్ గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాత్రికేయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నగర కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, ఎంసిఎంసి మెంబర్ సెక్రటరీ వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రపంచలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను చైతన్య పరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలన్నారు. వార్తా కథనాలు ప్రచురించే ముందు వాస్తవాన్ని తెలుసుకుని ప్రచురించాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పి ఆర్ ఓ మస్తాన్, డివిజనల్ పిఆర్‌ఓ సునీల్ సాగర్, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సిబ్బంది, పాత్రికేయులు హాజరయ్యారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్

బేవరేజ్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి -కడప అర్బన్

బేవరేజ్ హమాలీలకు ఎగుమతి కూలి రేట్లు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో హమాలీ కార్మికుల ధర్నాకు మద్దతుగా కడప పాత బస్టాండ్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగుమతుల కూలి రేట్లు పెంచాలని ఈ4నవిజయవాడలో ఎపి ఎస్‌బిసిఎల్ ఎమ్‌డి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎగుమతి కూలి రేట్ల ఒప్పందం 2024, అక్టోబర్ 31తో ముగిసిందని పేర్కొన్నారు. ఎపి ఎస్‌బిసిఎల్ యాజమాన్యం కొత్త మద్యం రవాణా ఒప్పందదారులతో కూలి రేట్లు నిర్ణయించకుండా ఆలస్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా ఎగుమతి కూలి రేట్లు పెంచి హమాలీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎన్ఆర్‌సి జెఎసి నాయకులు బాబు భాయ్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, హమాలీ యూనియన్ నాయకులు వెంకటరమణ, రెడ్డి ప్రసాదు, వెంకటసుబ్బయ్య, తిమ్మయ్య పాల్గొన్నారు.



హమాలీలకు మద్దతుగా నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

తియ్యని సుందర భాష ఉర్దూ

ప్రజాశక్తి - కడప అర్బన్

తియని, సుందర భాష ఉర్దూ అని, ఈ మాధ్యమం చదివే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని వైవీయూ పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.ఎస్ షావల్లిఖాన్ అన్నారు. వైవీయూలోని హ్యూమానిటీస్ బ్లాక్‌లో ఉర్దూ శాఖ మంగళవారం ఉర్దూ దినోత్సవాన్ని ఆ శాఖ అధిపతి ఆచార్య కె. రియాజునిసా అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ పిఎస్ షావల్లిఖాన్ మాట్లాడుతూ ఉర్దూను అభ్యసించే వారికి వేమన విశ్వవిద్యాలయం ఒక చక్కటి వేదిక అన్నారు. ఉర్దూ శాఖ శాఖ అభివృద్ధికి అందరి సహకారం ఉందని తెలిపారు. భాషా సంస్కృతి చారిత్రక నేపథ్యం ప్రస్తావించారు. ఉర్దూ మధ్యమంలో చదివినప్పటికీ డిగ్రీ కాలేజీ లెక్చరర్స్, జూనియర్ కాలేజ్, ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి వంటి పరీక్షలు రాసి పొద్దుగాల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చన్నారు. విశ్వవిద్యాలయంలో ఉర్దూ భాష ఉన్నతికి అధికారులు, ప్రతి ఒక్కరు సహకరించాలని, పరిశోధనల దిశగా నిర్ణయం తీసుకోవాల్సిందన్నారు. హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అరబిక్, పర్షియన్, తుర్కీ భాషల నుంచి ఉర్దూ భాష పుట్టిందన్నారు. చరిత్ర శాఖ ఆచార్యులు కంక ణాల గంగయ్య మాట్లాడుతూ మధ్య యుగంలో ఉర్దూ ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతి, మానవ సంబ ంధాలు, సమాచారం చేరవేసేందుకు భాష అవసరమన్నారు. 17 నుంచి19 శతాబ్దాల్లో ఉర్దూ భాష అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఉర్దూ భాషా దినోత్సవం సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు అతిథులు బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు పి రమాదేవి, పార్వతి, ఉర్దూ శాఖ అధ్యాపకులు డాక్టర్ ఖాజా పీర్, సర్దార్ ఖాజమైనుద్దీన్, డాక్టర్ నజీమున్నీసా, రెహనా పర్వీన్, సయ్యద్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన విధుల నిర్వహణకే శిక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్

రాబోవు ఎన్నికల్లో సిబ్బంది మెరుగైన విధులు నిర్వహించేందుకే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎఆర్ ఎఎస్‌పి కృష్ణారావు పేర్కొన్నారు. ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రారంభమైన యాంటీ-రయట్ డ్రిల్ శిక్షణ ముమ్మరంగా కొనసాగుతోంది. మంగళవారం సివిల్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది నూతనోత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. ఎఎస్‌పి శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందనను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా గ్యాస్ గన్‌తో గ్యాస్ షెల్ వినియోగంచే విధానం, వజ్ర వాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, ఎఆర్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



శిక్షణలో మహిళా పోలీసులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వల్లూరు

వేసవి కాలంలో దాహాన్ని తీర్చేందుకు మండల కేంద్రంలోని కడప-తాడిపత్రి జాతీయ రహదారి అక్షింతల ఓబాయపల్లి కనకదుర్గమ్మ గుడి వద్ద మామిళ్ల లక్ష్మమ్మ, మామిళ్ల సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎస్ఐ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు, బాటసారులు, వాహనదారులు వేసవి కాలంలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గడికోట సుబ్బారెడ్డి, పుత్తా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

ఫిట్‌నెస్ కోసం ఆటలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి యువత ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకుని ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యంగా, ఫిట్ గా ఉంటారని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ అన్నారు. మంగళవారం బాలాజీ నగర్ లోని యూత్ హాస్టల్స్‌లో నెహ్రూ యువ కేంద్రం, జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ సమితి వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తిని పెంచుకుంటే మనకి ధైర్య సాహసాలు పెరుగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను నేర్చుకోవాలని తెలిపారు. క్రీడల్లో శక్తి వంచన లేకుండా కృషి చేస్తే విజయంతో పాటు శరీరం దృఢంగా మారుతుందని చెప్పారు. పోటీలో శ్రీహరి డిగ్రీ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు మొదటి స్థానం, ఆర్ట్స్ కాలేజ్ నుంచి వచ్చిన విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథిగా మణికంఠ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాలంటీర్స్ బాలాజీ, కల్యాణి, దేనేష్, సాయిస్వర్, విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

సదస్సులు పరిశోధనలకు ఉపయోగకరం

ప్రజాశక్తి - కడప

అంతర్జాతీయ సదస్సులను నిర్వహించటం వల్ల ప్రపంచంలోనే ప్రసిద్ధ పరిశోధనల గురించి తెలు సుకోవటానికి అధ్యాపకు లకు, విద్యార్థులకు ఎంతగానో దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ వై. సావిత్రి అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతు శాస్త్ర శాఖ, గ్లోబల్ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'ఆన్ సోషియో ఎకనామిక్ రిలయన్స్ ఇన్ సైన్స్ సోషల్ సైన్స్ అండ్ కామర్స్ టువర్డ్స్ సస్టైనబులిటీ' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ వై. సావిత్రి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో సుస్థిర అభివృద్ధిని సాధించడానికి సామాజిక ఆర్థిక అంశాలు ఏ విధంగా ఉప యోగపడతాయి అనే అంశాలను ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకోవచ్చుని తెలియజేశారు. సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ పి. రవి శేఖర్ మాట్లాడుతూ 2047 సంవత్సరానికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉండటానికి అధ్యా పకులు, విద్యార్థులు, శాస్త్రవేత్తల ప్రాముఖ్యతను తెలుసు కోవటానికి ఇటువంటి కార్యశాలలు ఎంతగానో ఉపయో గపడతాయని తెలియజేశారు. మొదటి కీనోట్ స్పీకర్‌గా శాలిస్బరీ యూనివర్సిటీ అమెరికా నుండి ప్రొఫెసర్ ప్రవీణ్ సప్తర్షి సుస్థిర అభివృద్ధిలో ఆర్థిక అంశాల యొక్క ప్రాము ఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సౌత్ కొరియాకు చెందిన గుడాకే, ప్రొఫెసర్ అద్విటోట్ శివరాయ, సంతోష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్, ఐక్యు ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. రామచంద్ర, వివిధ టెక్నికల్ సెషన్స్‌కి చైర్ పర్స న్స్‌గా డాక్టర్ డి. వి. నాగేంద్ర కుమార్, శశి దేవి, మహేష్, అరుణకుమారి, నీత, రంజిని పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కెఎల్ఎం విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : బెంగళూర్‌కు చెందిన టాప్ అకాడమీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కె ఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వి.జీవిత, ఎం.అరుణా దేవి, సి.లావణ్య ఎంపికయ్యారు. వీరు మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగం పొందుతారు. రూ. 3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వార్షిక వేతనం పొందుతారు. వీరు ఎంపిక కావడం పట్లఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. రత్నమ్మ, ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్ నాయక్ అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌టిసి ఇయులో మహిళా దినోత్సవ వేడుకలు

కడప అర్బన్ : ఎపిపిఎస్ ఆర్‌టిసి ఇయూ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఆర్‌టిసి మహిళా ఉద్యోగులు ఉత్సహంగా చేసుకున్నారు. అమరావతి మహిళావిభాగం చైర్ పర్సన్ మేరీ విజయకుమారి, జనరల్ సెక్రెటరి విజయ, సిఓ చైర్ పర్సన్ శారద దేవీ, అనురాధ, జిల్లా సెక్రటరీలు సుజాత, పద్మావతి, శాంతకుమారి, సభ్యులు పాల్గోన్నారు. ముఖ్యఅథితిగా ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఏఐటియుసి జిల్లా నాయకురాలు బషీరున్నిసా, రీజినల్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రోజమణి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు బోసుబాబు, సెక్రటరీ రామమూర్తి, జోనల్ నాయకులు ప్రమీల హాజరయ్యారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక ఒకటవ వార్డు, తూర్పు హరిజనవాడలో కొట్లూరు వెంకటకృష్ణయ్య అనారోగ్య కారణంగా మృతిచెందాడు. విషయాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు వారిస్, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు శ్రీ గుమ్మ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి మంగళవారం పోచిమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున మృతుని కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా వెనుదన్నుగా ఉంటామని ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి , మైనార్టీ నాయకులు అన్వర్, స్థానిక గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ జుమ్మన్, 5వ వార్డు సభ్యులు ఇబ్రహీం హస్రత్, డాక్టర్ మధు, సిరిపురం వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

కడప : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని సిఎస్ఐ స్కూల్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కూడా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కడప నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం 1978 సిఎస్ఐ పాఠశాల పూర్వపు విద్యార్థులు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదలకు కడుపునిండా భోజనం పెట్టాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

తాగునీటి సమస్యపై అధికారులు శ్రద్ధ వహించాలి : 'మేడా'

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో ఎంపిపి అక్కిశెట్టి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు గడ్డం జనార్ధన్‌రెడ్డి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ రాబోవు మూడు నెలలు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ఏ గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తకూడదని చెప్పారు. అనంతరం అజెండా ప్రకారం అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ప్రసం గించారు. ముందుగా ఆరోగ్య శాఖ సంబంధించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు మాట్లాడుతూ వేసవిలో వృద్ధులు, పిల్లలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలకు ఆరోగ్య సలహాలు, సూచనలిస్తారని చెప్పారు. ఎపిఒ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు గుర్తించి మంజూరు కోసం నివేదికలు పంపించామన్నారు. మండలంలో 4 వేలకు పైగా జాబ్‌కార్డులున్నాయని, ఇప్పటివరకు 400 కుటుంబాలకు పనులు కల్పించామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 5.36 కోట్లు పనులకు ఖర్చు చేశామని అన్నారు. మండల వ్యాప్తంగా ఆర్టికల్చర్ కింద 160 హెక్టార్లకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యపై సర్వే చేశామని, ఎక్కడైనా సమస్య ఉంటే తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అన్ని ప్రాదేశిక ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు అధికారులు, సిఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - కడప

ఈనెల 7 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో నిర్వహించే 52వ జాతీయ మహిళా హ్యాండ్ బాల్ ఛాంపియన్ పోటీలలో పాల్గొనేందుకు కడప జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు పాలగిరి లావణ్య, ఎనకండ్ల నాగ పూజిత, వేలూరి దేవిక ఎంపిక అయినట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్, జిల్లా అధ్యక్షులు లయన్ చిన్నపరెడ్డి తెలిపారు. ముగ్గురు క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. చెన్నూరుకు చెందిన పాలగిరి లావణ్య జూనియర్ నేషనల్ హ్యాండ్ బాల్ పోటీలకు రెండుసార్లు, బీచ్ హ్యాండ్ బాల్ నేషనల్ పోటీలకు ఒకసారి పాల్గొని సెమీఫైనల్స్‌లో రాణించారు. సౌజోన్ నేషనల్స్లో రెండు సిల్వర్ మెడల్స్ కూడా సాధించారు. ప్రస్తుతం సీనియర్ నేషనల్ హ్యాండ్ బాల్ మహిళ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఎనకండ్ల నాగ పూజిత కూడా వివిధ గురుకులలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచారు. వేలూరి దేవికా పలు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచారు.

వైసిపి ప్రజల ప్రభుత్వం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-బి. కోడూరు

వైఎస్ఆర్‌సిపి ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాధవరాయవునిపల్లెలో మంగళవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ, రూ. 27 లక్షలతో సిసి రోడ్లు, రూ.5 లక్షలతో ఆర్ఒ ప్లాంట్ల ప్రారంభోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచు కుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కోడూరు చెన్నమ్మ, పాయలకుంట్ల సర్పంచ్, మండల నాయకులు వెంగళ యోగానంద రెడ్డి, ఒ. ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, వైస్ ఎంపిపి శేఖర్ రెడ్డి, లక్ష్మీ నర్సారెడ్డి, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, మునిరెడ్డి, తహశీల్దార్ మహేశ్వరి బాయ్, ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని పలు కోర్టులలో ఫొటో కాపియర్ మిషన్ సరఫరా, ఇన్ స్టాలేషన్ చేయు నిమిత్తం ఆసక్తి గల సరఫరా దారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సప్లయ్, ఇన్ స్టాలేషన్ రంగంలో అర్హతలు, అనుభవం కలిగిన వారు ఈనెల 18న సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తుల సీల్డు కొటేషన్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో నేరుగా సమర్పించాలని పేర్కొన్నారు. టెండర్లకు సంబంధించి పూర్తి వివరాల కోసం జిల్లా ప్రధాన కోర్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. టెండరు నిర్వహణ ప్రక్రియ నిబంధనలు, షరతులకు లోబడి ఉంటుందని తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మండలం చెన్నంపల్లి గ్రామ పొలం సర్వే నెంబర్ 1580/ఎలో ఎస్‌టి స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు నుసిమి గౌస్ పీర్ రెవెన్యూ డిపార్ట్మెంట్ ఎఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ ఎస్‌టి ఎరకుల కులానికి చెందిన 20 కుటుంబాలకు 2013వ సంవత్సరంలో గృహ నివాస పట్టాలు మంజూరు చేశారని, వారు గుడిసెలు నిర్మించుకుంటే ఇటీవల కొంతమంది అనధికారంగా దౌర్జన్యంగా గుడిసెలు నిర్మించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఎస్‌టిలకు న్యాయం చేయాలన్నారు.

డిగ్రీ కళాశాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

పట్టణంలోని శ్రీ వెంగమాంబ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఛైర్మన్ గుర్రం పుల్లప నాయుడు మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సామగ్రిని వితరణ చేశారు. రూ. 25 వేలు విలువ చేసే 30 కుర్చీలు, బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ఉన్నత విద్యను బోధించే కళాశాలకు తన వంతు సహకారం అందించానని చెప్పారు. కళాశాల న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధించి గుర్తింపు పొందాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్. ప్రకాష్‌రావు, పిఆర్ఒ అధ్యాపకులు పీరయ్య, శ్రీనివాసులు, కళ్యాణ్‌కుమార్, పర్వీన్, నగేష్, రవిచంద్ర, యంబడి ఈశ్వరయ్య, నరసింహా రెడ్డి, మధుబాబు, సబిత, గుర్రమ్మ, మల్లిఖార్జున,రవిచంద్ర, నరసింహా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల యాజమాన్యం



ప్రచార సామగ్రితో ఎంపిపి, నాయకులు

ప్రభుత్వ పథకాలను వివరించాలి

ప్రజాశక్తి - చాపాడు

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన పథకాలను గుర్తుచేయాలని ఎంపిపి టి.లక్ష్మయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో సిద్ధం పేరుతో ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లను సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అయిదేళ్ల వైసిపి పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రతి ఇంటికి ఏదోక విధంగా లబ్ధి చేకూరిందన్నారు. పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వాటిని వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, పల్లవోలు సర్పంచ్ ప్రసాద్, నాయకులు రమణయ్య, సురేష్, గృహసారథులు పాల్గొన్నారు.

7న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాం జనేయులు, ప్లేస్‌మెంట్ అధికారి టివి అరవింద్ తెలిపారు. ఆ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ (ఎపిసిసిఇ), ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కడప ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయా కంపెనీలు వస్తున్నాయన్నారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ ఏడాది చదువుతున్న బిఎ, బికాం, బీఎస్సీ విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు వేల్పుచెర్ల, పెద్దదుద్యాలలో భూపేష్‌రెడ్డి పర్యటన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని వేల్పుచెర్ల, పెద్దదుద్యాల గ్రామాల్లో బుధవారం సాయంత్రం జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించనున్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొంటారని టిడిపి నాయకులు తెలిపారు.



మహాశివరాత్రి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూత్

8న మాధవరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - మైదుకూరు

ఈనెల 8న మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక మాధవరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు లక్ష్మీ మాధవరాయ స్వామి యూత్ తెలిపారు. శ్రీశ్రీభీమేశ్వర స్వామి మరకత లింగం పార్వతిదేవి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారికి హోమాలు, కల్యాణం, ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం ఉంటుంది. అనంతరం స్వామివారి లింగోద్భవ కాలంలో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

28 నుంచి గండి క్షేత్రంలో సంప్రోక్షణ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ క్షేత్రం పడమటివైపులో ఉన్న ఆలయంలో ఈనెల 28 నుంచి మూడు రోజులపాటు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీహరి తెలిపారు. కార్యక్రమాలను శ్రీ యోగి రామానంద స్వామి చరణ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు సదాశివశర్మ, ఉపాధ్యక్షులు దండపాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సెక్రెటరీ కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కావాలి హరినాథ్, శివాలయం మెంబర్లు అపరాజిత, శ్రావణ్, అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మహిళలకు బుధవారం ప్రస్తుతం రోజుల్లో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటీ అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈ ఉపన్యాస పోటీల్లో పాల్గొని మహిళా దినోత్సవం వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - సింహాద్రిపురం



పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

మండల కేంద్రమైన సింహాద్రిపురం బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను లారీ ఢీకొంది. బస్టాండ్ ఆవరణలో సిమెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో లారీ అదుపుతప్పి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడింది. ట్రాన్స్‌ఫార్మర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిసిల నిజమైన నేస్తం కాంగ్రెస్ ఒక్కటే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

బిసిల పట్ల నిజమైన నేస్తం కాంగ్రెస్ పార్టీకే ఉందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బిసిల పట్ల వైసిపి, టిడిపిలది కపట ప్రేమ అన్నారు. జగన్ పాలనలో బిసి కార్పొరేషన్లు నేతి బీరకాయ చందంగా తయారయ్యాయని విమర్శించారు. బిసిల సాధికారితక కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని తెలిపారు. మహాత్మా గాంధీ, జ్యోతి రావు పూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పూర్వకంగా నిర్వహించినట్లు చెప్పారు. బిసిల ఛాంపియన్లము తామంటే తామని వైసిపి, టిడిపి డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిసిల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే బిసి కార్పొరేషన్లకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **రఘువీరారెడ్డిని కలిసిన వేంపల్లె నాయకులు :** ఎపి పిసిసి మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డిని వేంపల్లె కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠాపురం గ్రామంలో రఘువీరారెడ్డిని ఎఐసిసి సభ్యుడు ధృవకుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీగాల రామకృష్ణ కలిసి కడప జిల్లా రాజకీయాలపై చర్చించారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారని తెలిపారు.

సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



సమావేశాన్ని బహిష్కరించడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు, చైర్మన్, కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ అలీ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి చైర్మన్ తో సహా కేవలం ఏడుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. వారు కూడా సమావేశం మొదలు కాక ముందే బహిష్కరించి వెళ్లిపోయారు. గత నెల 5న నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో పలువురు కౌన్సిలర్ల రాజీనామాలతో సమావేశం రసాభాసగా మారిన విషయం తెలిసిందే. రాజీనామా చేసిన కౌన్సిలర్ల బుజ్జగింపు పర్వం కాసేపు కొనసాగినా.. అనంతరం కౌన్సిలర్లు నగర పంచాయతీ కార్యాలయం నుండి వెళ్లిపోయారు. కానీ ఆ రోజు జరిగిన బడ్జెట్ సమావేశంలో ఎజెండాలోని అంశాలను కౌన్సిలర్లు ఆమోదించినట్లు అధికారులు చూపారు. ఆరోజు జరిగిన సమావేశంలో ఏ కౌన్సిలర్ అజెండాలోని అంశాలను ఆమోదించారో చెప్పాలంటూ కమిషనర్, చైర్మన్‌ను కౌన్సిలర్లు నిలదీశారు. మీకు ఇష్టం వచ్చి నట్లు వ్యవహరిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అంటూ వారిపై మండిపడ్డారు. అజెండాలోని అంశాలు మీరే ఆమోదించుకునేందుకు కౌన్సిలర్లు ఎందుకు అంటూ సమావేశం నుండి వెళ్లిపోయారు. చైర్మన్, కమిషనర్ మౌనం వహించారే తప్ప కౌన్సిలర్లను నిలువరించే ప్రయత్నం కూడా చేయలేదు. సమావేశానికి చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జైబున్నిసా, కౌన్సిలర్లు నాగిరెడ్డి, పెన్నా రషీద్, ఎరికల రెడ్డి, జంషీర్, అలీ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన కౌన్సిలర్లు రాకపోగా, వచ్చిన కౌన్సిలర్లు కూడా సమావేశాన్ని బహిష్కరించడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పేదల సొంతింటి కల సాకారం : ఎమ్మెల్యే



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని డిసిఎల్ కల్యాణ మండపంలో మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. మైదుకూరు పట్టణంలో 3,814 మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారని, 3,726 మందికి సొంత స్థలాలు ఉండగా ప్రభుత్వం ఇళ్లు నిర్మించిందని తెలిపారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 7,540 మందికి గృహాలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మైదుకూరులో నిరుపేదలకు ఒక్క ఇంటికి సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని ఏ ఒక్క నిరుపేద కూడా సొంత ఇల్లు లేదని బాధపడకూడదనే.. వారికి ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారన్నారు. 2014లో చంద్రబాబు ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో మహిళలకు రుణం, వడ్డీతో కలిసి రూ.25,600 కోట్లు మహిళల బ్యాంకు అకౌంట్‌లోకి జమ చేశారన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగి ఉంటేనే వైసిపికి ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం మహిళలకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఎంపిపి రఘురామిరెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మదీనా దస్తగిరి, సింగల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో పలువురు వైసిపిలో చేరిక

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, పేదలకు న్యాయం జరగాలనేదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు వెంకటసుబ్బయ్య కాలనీలో పలు కుటుంబాలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందన్నారు. అనంతరం గుడి నిర్మాణానికి రూ.2 లక్షల నగదును వితరణ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మదీనా దస్తగిరి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన సిఎం జగన్



బిటెక్ రవి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెట్టాడని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. స్థానిక గండి రోడ్డు, ఇమాం నగర్, సంఘం వీధి, వడ్డె వీధి, కాపువీధిలో మంగళవారం ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి లతారెడ్డి ఇంటింటికి తిరిగి టిడిపి అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సంఘం వీధిలో టిడిపి నాయకుడు వేమ కుమార్ ఆధ్వర్యంలో బలిజ సంఘం ఉపాధ్యక్షుడు యడాల రామచంద్ర, యడాల శ్రీనువాసులు, జగదీష్, దినేష్, ప్రసాద్, మరో 10 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ ప్రజల నుండి టిడిపికి మంచి స్పందన వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, ఆర్‌వి రమేష్, రెడ్డి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, తెలంగాణవలి, వేమకుమార్, మడక శ్రీనివాసులు, మహమ్మద్, జబిబుల్లా, డక్కా రమేష్, మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ దొంతు సుబ్బారావు, మాజీ సర్పంచ్ శ్రీరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - మైలవరం



టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపేష్‌రెడ్డి

మండల పరిధిలోని చిన్న కొమెర్ల గ్రామంలో ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి వర్గానికి చెందిన వంద కుటుంబాలు మంగళవారం జమ్మలమడుగు టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. రామాంజనేయరెడ్డి, తిరుపాల్రెడ్డి, గురు ప్రసాద్‌రెడ్డి గణేష్‌రెడ్డి, ముని ప్రసాద్‌రెడ్డి, పలు కుటుంబాలు చేరాయి. అనంతరం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మహానాడులో సూపర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారని వివరించారు.



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు

జగన్ మహిళా పక్షపాతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాపక్షపాతి అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక 16వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులోని మహిళలకు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి ఖాతాల్లో రూ.33 కోట్ల15లక్షల21వేయి935 జమచేశారని తెలిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.150కోట్లతో పట్టణంలోని ప్రతి ఇంటికి మంచినీరు సరఫరా చేయించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ వార్డు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదన్నారు. ఇప్పుడు వార్డు అవసరాలు తీర్చామన్నారు. పట్టణంలోని 41వార్డుల్లో రూ.120 కోట్లతో రోడ్లు, కాలువల పనులు పూర్తి చేశామన్నారు. జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డును రూ.5లక్షల నుండి రూ.25లక్షలకు పెంచిందన్నారు. ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. వచ్చేది జగన్ ప్రభుత్వమే అని, పేదలు ఏకపక్ష నిర్ణయానికి వచ్చారన్నారు. వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

10న నూతన విద్యా విధానంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈనెల 10న కడపలోని మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక రాఘవేంద్ర హైస్కూల్‌లో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో అపుస్మా సమావేశం నిర్వహించారు. సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం జమ్మలమడుగు అపుస్మా అధ్యక్ష, కార్యదర్శి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని ఆనంద్ సిరి ప్రగాఢ సూచించారు. రాణి తిరుమల్ దేవి డిగ్రీ కళాశాలలో మంగళవారం కెసిపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సఫాలా రివైర్ యువర్ బ్రెయిన్ అంశంలో భాగంగా విద్యార్థులకు అనేక అంశాలపై మోటివేషన్ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఒత్తిడిని అధిగమించేందుకు, కుంగుబాటు నుంచి తప్పించుకునేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ చంద్ర శేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పల్స్‌పోలియో నిర్వహణపై ఆరా తీస్తున్న డాక్టర్ మల్లేష్

'పల్స్ పోలియో' విజయవంతం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో మూడు రోజులుగా జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని బద్వేలు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మల్లేష్ తెలిపారు. మండలంలో మంగళవారం డాక్టర్ మల్లేష్ చాపాడు, నక్కలదిన్నె, అనంతపురం, అల్లాడుపల్లె, బద్రిపల్లె, విశ్వనాథపురం గ్రామాల్లో డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి పోయి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4,632మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. వందశాతం లక్ష్యం పూర్తయిందన్నారు. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్ కావ్య మాధురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా పల్స్ పోలియోను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు ఫర్హాట్ అంజుమ్, కీర్తి, సుజాత, సాలమ్మా, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అవగాహన

ప్రజాశక్తి - చాపాడు



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీ ప్రసన్న

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎస్ లక్ష్మి ప్రసన్న, దంత వైద్యులు డాక్టర్ పోసిన రామకృష్ణ, కంటి వైద్యులు సత్యహరీష్ రెడ్డి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. జీవన విధానం గురించి అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ వి లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం, పరిశరాల శుభ్రత పట్ల కనీస అవగాహన, ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమన్నారు. ఆ మేరకే వైద్యశిబిరం నిర్వహించామన్నారు. వైద్యులను పాఠశాల తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రవీంద్ర కుమార్, పాఠశాల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధులు వీరే

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధుల జాబితాను పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విడుదల చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపిసిసి ఛీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి, ఎఐసిసి ఇన్‌ఛార్జి ఠాగూర్ ఆమోదంతో 19 మంది ఎపిసిసి అధికార ప్రతినిధుల నియామకం జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. గంగాధర్ (అనకాపల్లి), జెర్రిపోతుల ముత్యాలు (విశాఖపట్నం), కె.వీరన్న పడాలు (అల్లూరి సీతారామరాజు), కాటం రవి (తూర్పు గోదావరి), గడ్డం సురేష్‌బాబు (బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ), కొవ్వూరి శ్రీనివాస్ (తూర్పు గోదావరి), రుద్రరాజు గోపాల కృష్ణంరాజు (బి.ఆర్.అంబేడ్కర్ కొనసీమ), డి.వి.ఆర్.కె.చౌదరి (ఏలూరు), మొహమ్మద్ హాజీ సర్వార్ బేగ్ (ఎన్టీఆర్), కర్ణాటి అప్పారావు (ఎన్టీఆర్), గోవిందు శంకర్ శ్రీనివాసన్ (పల్నాడు), చిన్న రామాంజినేయులు (కర్నూలు), నేతి మహేష్ (ప్రకాశం), ప్రియాంకా దండి (విశాఖపట్నం), పూల నజీర్ అహ్మద్ (వైఎస్ఆర్), పూల భాస్కర్ (అన్నమయ్య), రామానాయుడు (అనంతపురం), ఎం.గోపాల్‌రెడ్డి (తిరుపతి), పూతలపట్టు ప్రభాకర్ (చిత్తూరు)ను నియమించినట్లు వివరించారు.

నల్లబల్లె వెంగమ్మ నేత్రదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంకాలమ్మపేటకు చెందిన నల్లబల్లె వెంగమ్మ (85) మంగళవారం మృతి చెందడంతో ఆమె కుమారుడు నాగ భూషణ్‌రెడ్డి, కోడలు నాగమని, మనువరాళ్లు ఉమా మల్లేశ్వరి, హేమ నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ వెంగమ్మ ఇంటికెళ్లి పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానం చేసేందుకు అంగీకారం తెలిపిన తర్వాత 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలని రాజు కోరారు.